వడ్డెర్ల సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చే పార్టీకే మద్దతు..

నాగోలు: రాష్ట్రంలోని వడ్డెర్ల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే ఈ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలుమల్లు, తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్, జీహెచ్‌ఎంసీ కార్మిక సంఘం అధ్యక్షుడు కొడిదల శ్రీను అన్నారు. శుక్రవారం నాగోలులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాగోలు వడ్డెర సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న శ్రీను మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి వడ్డెలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చుతామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాగోలు వడ్డెర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ.. కమిటీ నూతన అధ్యక్షుడిగా సంపండి కుమార్, ఉపాధ్యక్షుడిగా సంపంగి సారంగం, గౌర వ అధ్యక్షుడిగా రాపోలు రాంబాబు, వర్కింగ్ ప్రెసిడె ంట్‌గా బోసు సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఆలకుంట కరుణాకర్, కార్యదర్శిగా ఆలకుంట రమేష్, సహాయ కార్యదర్శి సంపంగి సురేష్, కోశాధికారి బోసు సంపత్, యూత్ అధ్యక్షుడిగా సంపంగి చిన్న, మహిళా అధ్యక్షురాలిగా సూర రేణుకలను ఎన్నుకున్నారు .

చాదర్‌ఘాట్ సీఐపై ఫిర్యాదు

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ సీఐపై మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ మలక్‌పేట ఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎంఐఎంకు వంత పాడుతూ, ఆ పార్టీ కార్యకర్తలా ప్రవర్తిస్తున్నాడని, అకారణంగా తమను దుర్భాషలాడాడని సీఐపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అభ్యర్థి మలక్‌పేట ఆర్‌ఓకు ఫిర్యాదు చేశాడని ఎన్నికల కార్యాలయం తెలియజేసింది.

నిర్మాణ కార్మికులకు అండగా ఉంటాం

ఎల్బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



గడ్డిఅన్నారం డివిజన్ పీ అండ్ టీ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే. (చిత్రంలో) ఎల్బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

వనస్థలిపురం: భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. చంపాపేట డివిజన్‌లో సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో నాయకులు జిట్టా సురేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సెంట్రింగ్ మేస్త్రీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు, 50 మంది సభ్యులు శుక్రవారం మధుయాష్కీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరికీ గూడు కట్టే భవన నిర్మాణ కార్మికులకే ఇళ్లు లేకపోవడం బాధాకరమని అన్నారు. అధికార పార్టీ నాయకులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తమ అనుచరులకే ఇప్పించుకున్నారని ఆరోపించారు. ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరబోతోందని, భవన నిర్మాణ కార్మికుల కష్టాలను తీర్చే బాధ్యత తనదేనని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మాజీ కౌన్సిలర్ దంపతుల చేరిక

వనస్థలిపురం సచివాలయనగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్లు ఉమా శ్రీనివాస్, శ్రీనివాస్ దంపతులు గురువారం రాత్రి వనస్థలిపురంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ, గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్లు ఉమా శ్రీనివాస్, శ్రీనివాస్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరామని, మధుయాష్కీ గౌడ్ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.


చంపాపేటలో భవన నిర్మాణ కార్మికులతో ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్


మధుయాష్కీ గౌడ్‌తో కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్

తెలంగాణలో సమర్థ పాలన బీజేపీకే సాధ్యం

– కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి


ప్రచారంలో పాల్గొన్న కేంద్రమంత్రి మీనాక్షి లేఖి

సైదాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సమర్థ పాలన బీజేపీకే సాధ్యమవుతుందని కేంద్ర విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి అన్నారు. అవినీతి రహిత పాలన కోసం తెలంగాణ వాసులు ఈఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆమె కోరారు. శుక్రవారం యాకుత్‌పురా నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎన్.వీరేంద్రబాబు యాదవ్‌కు మద్దతుగా ఆమె ఐఎస్ సదన్ డివిజన్ శ్రీసాయి నగర్, సుబ్రహ్మణ్యనగర్ కాలనీల్లో రోడ్‌షో నిర్వహిస్తూ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీనాక్షి లేఖి మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కార్ కంటే కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధే ఎక్కువగా ఉందన్నారు. దశాబ్దాల కాలంగా పాతబస్తీలో అభివృద్ధి జరగకుండా మజ్లిస్ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారని విమర్శించారు. పాతబస్తీ అభివృద్ధి కోసం యాకత్‌పురా నియోజకవర్గంలో వీరేంద్రబాబు యాదవ్‌ను గెలిపించాలని ఆమె కోరారు.

బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి

– మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి


అక్బర్‌బాగ్‌లో వృద్ధుడిని ఓటు అడుగుతున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం అక్బర్‌బాగ్‌లో ఓటర్లను కలిసి కమలం పువ్వు గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల నుంచి తమ ప్రచారానికి మంచి స్పందన లభిస్తోందని, మలక్‌పేటలో కాషాయ జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. డివిజన్ అధ్యక్షుడు నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింహ, మాజీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ సహదేవ్ యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు అన్ని వర్గాల ఆదరణ

– యాకుత్‌పురా అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి



సైదాబాద్: రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగింపు కోసం ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలని యాకుత్‌పురా బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, ఆదర్శనగర్ కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అన్నివర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీనే ఆదరిస్తున్నారని, ఈసారి ఎన్నికల్లో యాకుత్‌పురా వాసులు తనను గెలిపిస్తారని సామ సుందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

– మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గ ప్రజలు అవకాశమిచ్చి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్, ఎంసీహెచ్ కాలనీ, దోభీగల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ అక్బర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను విశ్వసించి మలక్‌పేట ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, బాబు శ్రీనివాస్, జాఫర్, షకీల్ పాల్గొన్నారు.

మలక్‌పేటను ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తా..

చంచల్‌గూడ: మలక్‌పేట నియోజవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తానని కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. గురువారం రాత్రి చావణీ–చంచల్‌గూడ చౌరస్తాలో ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయ సోపానాలు

- ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి
- జోరుగా బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం


లింగోజిగూడలో ఓటర్లకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ప్రచారంలో భాగంగా టీ పెడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న సుధీర్‌రెడ్డి

చంపాపేట: సంక్షేమ, అభివృద్ధి పథకాలే బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తెస్తాయని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని లింగోజిగూడ పాతబస్తీ, మసీద్ గల్లీ, కామేశ్వరరావు నగర్, సాయినగర్ వంటి పలు కాలనీల్లో స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి మరోసారి తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఎల్‌బీనగర్‌ను మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డికి కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు గజమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి తమ మద్దతు సుధీర్‌రెడ్డికే అని హామీ ఇచ్చారు. లింగోజిగూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు అమలుకు వీలుకాని హామీలు గుప్పిస్తూ ఓటర్లను మభ్యపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు నమ్మే స్థితిలో ఎల్‌బీనగర్‌వాసులు లేరని అన్నారు. ఎల్‌బీనగర్‌లో కళ్ల ముందు జరిగిన అభివృద్ధి, గడప గడపకు చేరిన సంక్షేమ పథకాలే తన ఘన విజయానికి దోహదపడతాయన్నారు. గడచిన ఐదేళ్ల పాటు నిత్యం మీలో ఒకడిగా ఉంటూ కాలనీ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ శాశ్వత పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశానన్నారు. గతంలో చినుకు పడితే చాలు లింగోజిగూడ డివిజన్‌లోని పలు లోతట్టు కాలనీలు పీకలలోతు మునిగేవని ప్రత్యేక నిధులతో బైరామల్‌గూడ చెరువునుంచి విజయపురి, ధర్మపురి, సాయినగర్, ధాతునగర్ వంటి కాలనీల ప్రధాన రహదారుల పక్కన వరదనీటి కాలువలు ఏర్పాటు చేసి వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చేశామని గుర్తు చేశారు మరోమారు తనను గెలిపించి సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని సుధీర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, శ్రీధర్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చంపాపేటలో...

చంపాపేట డివిజన్‌లోని కటకోనికుంట, గాంధీ చౌరస్తా, ముస్లింబస్తీ, రాజిరెడ్డి నగర్, ఎస్‌జీఆర్ వంటి పలు కాలనీల్లో పార్టీ సీనియర్ నాయకులు, కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు ముడుపు రాజిరెడ్డి, రాఘవాచారి, శివగౌడ్, శ్రీనివాస్, గిరి, తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి, రోజారాణి, రమాదేవి, ఉషారాణి, జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు బీజేపీతోనే సమన్యాయం

- జీసీలు, మాదిగలు ఏకమై సామ రంగారెడ్డిని గెలిపించుకుందాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


హయత్‌నగర్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న మంద కృష్ణమాదిగ, ఎల్‌బీ నగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి తదితరులు

మన్సూరాబాద్ సబ్బండ వర్గాలకు బీజేపీతోనే సమన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డికి మద్దతుగా హయత్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్‌కు అండగా ఉన్నామని, దళితులకు సీఎంను చేస్తానని ప్రకటించి మోసం చేశారన్నారు. దళితుల భూములను లాక్కున్న భూబకాసురుడు కేసీఆర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మాదిగల కుల సమావేశానికి హాజరై మాదిగల సుదీర్ఘ పోరాటం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నానని ప్రకటించి మాదిగల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించిన ఏకైక పార్టీ బీజేపీ అని, బీజేపీ అభ్యర్థులను గెలిపించుకొని బీసీని సీఎంను చేసుకుందామని అన్నారు. బీసీ లు, మాదిగలు ఏకమై ఎల్బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

- గడ్డిఅన్నారం, నాగోలు, హస్తినాపురంలో బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు.
- తెలంగాణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం, పద్మశాలి సంఘం రంగారెడ్డి జిల్లా కులస్తులు సామ రంగారెడ్డికి మద్దతు ప్రకటించారు.

'డబుల్' ఇళ్లు బంధువులకు పంచిన ఎమ్మెల్యే: సామ

పేదలకు అందాల్సిన పథకాలను పెద్దలకు, తన బంధువులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పంచాడని బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఆరోపించారు. ఎల్‌బీనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న పేదలను విస్మరించి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన ఇంట్లో, తన బంధువుల ఇళ్లలో పనిచేసే వారికి ఇళ్లు మంజూరు చేశారని మండిపడ్డారు. ఇళ్ల కేటాయింపుపై పూర్తి విచారణకు ఎమ్మెల్యే సిద్ధమా... అని సవాల్ చేశారు. ఎమ్మెల్యే అక్రమాలు, అవినీతిని దశలవారీగా ఆధారాలతో బయట పెడతామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ఆర్యవైశ్యులకు గౌరవం

నాగోలు: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులు బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి మద్దతివ్వాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులతో శుక్రవారం రాత్రి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆర్యవైశ్యులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని, సామ రంగారెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని పవన్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు రమేష్ గుప్తా, శ్రీనాథ్ గుప్తా, ప్రస్తుత అధ్యక్షుడు నాగభూషణం, రాహుల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన

ఎల్‌బీనగర్: తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి ఎస్ పంకజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ హాజరై పరిశీలించారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ రవీందర్‌కుమార్, ఏఆర్‌ఓ అరుణకుమారి, దశరథ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ


మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా స్థానికుల ఆదరణను విశేషంగా చూరగొంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందన్నారు.

కష్టసుఖాల్లో తోడుగా ఉంటా

మహేశ్వరం బీజేపీ అభ్యర్థి శ్రీరాములు యాదవ్


శ్రీరాములు సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు


జిల్లెలగూడలో ప్రచారం చేస్తున్న శ్రీరాములు సతీమణి అండాలు, కుమార్తె శిరీష

తుక్కుగూడ: బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆ పార్టీ కౌన్సిలర్ శివకుమార్ ఆధ్వర్యంలో శ్రీరాములు సమక్షంలో బీజేపీ చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని, ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాధవరెడ్డి, పలువురు యువకులు పాల్గొన్నారు.

శ్రీరాములును గెలిపించండి...

మీర్‌పేట: అందెల శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి అండాలు, కుమార్తె శిరీష కోరారు. శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 9, 19 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి.. 30వ తేదీన కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో స్థానిక నాయకులు జేడీ కుమార్, గడ్డం జగన్, కవిత, సునీత, మమతారెడ్డి, శిరీషరెడ్డి, సంగీత, మీనాక్షి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

పహాడీషరీఫ్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాకర్షక పథకాలు నచ్చి బీజేపీలో చేరేందుకు వివిధ పార్టీల నాయకులు ఉత్సాహం చూపుతున్నారని మామిడిపల్లి మాజీ కౌన్సిలర్ వేణుగౌడ్ తెలిపారు. శుక్రవారం రంగనాయకుల కాలనీకి చెందిన పలువురు వేణుగౌడ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహేశ్వరంలో అందెల శ్రీరాములు విజయం ఖాయమన్నారు. 25వ తేదీ (నేడు) తుక్కుగూడలో జరిగే ప్రధాని మోదీ సభను విజయవంత చేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి...

దిల్‌సుఖ్‌నగర్: బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రలే అవుట్ కాలనీ, సిరినగర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్, కరుణ, వెంకట్‌రెడ్డి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మహేశ్వరంలో కేఎల్లార్ విజయం ఖాయం


రఘుమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేఎల్లార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి సోనియాగాంధీకి కానుకగా ఇస్తామన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని తెలిపారు. అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేలు పంట పెట్టుబడి సాయం, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని తెలిపారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గోసుల హనుమంత్‌రెడ్డి, గోసుల వెంకట్‌రెడ్డి, గోసుల చంద్రశేఖర్‌రెడ్డి, కావలి శేఖర్‌తో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, ఎండీ సాబీర్, యాదగిరి పలువురు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవికి కేఎల్లార్ పూజలు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) శుక్రవారం ఆర్‌కేపురం కాలనీలోని ప్రత్యంగిరా దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ కేఎల్లార్‌కు ఆలయ జ్ఞాపికను అందజేశారు.


ప్రత్యంగిరా దేవికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి

దళిత, బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తా

– మలక్‌పేట మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల

మలక్‌పేట: దళిత, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడతానని మజ్లిస్ అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ డివిజన్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాలనీలలో ఏర్పాటు చేసిన గ్రూప్ మీటింగ్‌లకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రజలు మజ్లిస్ పార్టీకి అండగా నిలబడి మరోసారి మలక్‌పేటలో గాలిపటం ఎగురవేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ అస్లాం, కనుకుల రవీందర్‌రెడ్డి, మైలపాక రాంచందర్, చిట్టుపాక ప్రభాకర్, ఇలియాస్, బాబా, ఆరోగ్య పాల్గొన్నారు.

మా సమస్యల పరిష్కారానికి సిఫారసు చేయండి

– వేతన సవరణ సంఘానికి ప్రభుత్వ పెన్షనర్ల విజ్ఞప్తి

వనస్థలిపురం: పే–విజన్ కమిషన్ ద్వారా తమ సమస్యలపై ప్రభుత్వానికి తగు సిఫారసు చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ సభ్యులు.. వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య మాట్లాడుతూ, పెన్షనర్లకు బకాయిపడ్డ మూడు కరువు భత్యాలను విడుదల చేసిన తర్వాతే తమ మూల పెన్షన్‌పై ఫిట్‌మెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఐఆర్‌ను 5 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని, డీఏ/డీఆర్‌ల విడుదలలో జాప్యం తగ్గించాలని, పెన్షనర్లకు నగదు రహిత చికిత్సకు అవకాశం కల్పించాలని, వైద్య ఖర్చుల కోసం ఇచ్చే రీయింబర్స్‌మెంట్‌ను రూ. 5 లక్షల వరకు పెంచాలని కోరారు. ఈ సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వానికి తగు సూచనలు అందజేయాలని సంఘం చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు సూర్యనారాయణ, కృష్ణమూర్తి, రాజేంద్రబాబు, భరత్‌రెడ్డి, మాన య్య, పుల్లయ్య, జ్ఞానేశ్వర్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

హస్తినాపురం: కారులో అక్రమంగా మద్యాన్ని తరిలిస్తు న్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘ టన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ బొమ్మలగుడి ప్రాంతంలో నివసించే సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి కారులో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటోనగర్ వద్ద కారును ఆపి తనిఖీ చేశారు. అక్రమంగా తరలిస్తున్న 22 సిగ్నిచర్ ఫుల్‌బాటిళ్లు, 10 బ్లాక్ అండ్ వైట్ ఫుల్‌బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.